క్లుప్తంగా

అపార్ కార్డు తప్పనిసరి

ధర్మారం: ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థి అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల విద్యాధికారి పి.ప్రభాకర్ సూచించారు. మేడారంలో బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో అపార్ జనరేషన్ నమోదుకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి అపార్ జనరేషన్‌లో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు యుగేంద్ర లక్ష్మి, విద్యాసాగర్, కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ కుమారస్వామి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగుండం: అంతర్గాం మండలంలోని కేజీబీవీ స్కూల్‌లో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఏకాంబరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గాం మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ధర్మారం: మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ ఆదర్శ విద్యాలయంలోని వసతి గృహంలో విద్యార్థులకు వంట చేసేందుకు కుక్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. ఆదర్శ విద్యాలయంలో ఒక హెడ్ కుక్, రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఈనెల 29 లోపు స్థానిక కేజీబీవీ ప్రత్యేకాధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సన్మానం



సహస్రను సన్మానిస్తున్న శ్రీనివాస్

సుల్తానాబాద్: కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన పసెడ్ల సహస్రను బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ సన్మానించారు. స్వదేశానికి తిరిగి రావడంతో సోమవారం మండల కేంద్రంలో సత్కరించారు. గర్రెపల్లి గ్రామ నివాసి అయిన సహస్ర తండ్రి పసేడ్ల రాజు బీజేపీ క్రియాశీల సభ్యుడు కావడంతో ఆమెను కలిశారు. బీజేపీ నాయకులు నల్లవెల్లి శంకర్, కొల్లూరి సంతోష్, ఇగురం రామస్వామి, పసిడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఈవో ప్రశాంత్

సుల్తానాబాద్: మండల కేంద్రంలో రైతు భరోసా దరఖాస్తులను సోమవారం ఏఈవోలు ప్రశాంత్, స్వప్న స్వీకరించారు. రైతులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎంఈవోపై ఫిర్యాదు

ముత్తారం: అడవిశ్రీరాంపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఇరుగురాల ఓదెలుపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య తెలిపారు. ప్రభుత్వాన్ని కించపరిచేనట్లు మాట్లాడిన ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంగీకి కృతజ్ఞతలు



ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన సినిమా మ్యూజిక్ డైరెక్టర్ సుధాకర్ వెంగీ, నిర్మాత ఈశ్వర్, డైరెక్టర్ సురేశ్‌లకు భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసాద్ ఫిలిం ల్యాబ్‌లో ఈనెల 31న విడుదల కానున్న రాచరికం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హైదరాబాద్‌లో పాల్గొని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగిగా ఖని ఏడీఈ



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఎన్పీడీసీఎల్ ఏడీఈ కె.వెంకటేశ్వర్లు చేసిన సేవలకు గాను ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని విద్యుత్ భవన్‌లో సంస్థ సీఅండ్‌ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, నియమావళిపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



పేదల ఆకలి తీర్చడం మన బాధ్యత

గోదావరిఖనిటౌన్: సేవకు ప్రతి రూపం శ్రీధర్మశాస్త్ర నిత్యాన్న వేదిక వ్యవస్థాపకుడు కొటం బాబు అని, అన్నార్థుల ఆకలి తీర్చడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక పోచమ్మ దేవాలయ ఆవరణలో ఉచిత ఇడ్లీసాంబార్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఖనిలో సందల్ సందడి

గోదావరిఖనిటౌన్: శ్రీహజ్రత్ తాజొద్దీన్ బాబా జన్మదినం సందర్భంగా స్థానిక కాకతీయ నగర్‌లోని నిర్వాహకుడు నారదాసు సతీశ్‌రావు ఆధ్వర్యంలో బాబా దర్బార్‌లో సోమవారం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. సందల్ గంధం ఊరేగింపు కోలాట నృత్యాల నడుమ స్థానిక లక్ష్మీనగర్ మీదుగా దర్బార్ వరకు ఘనంగా జరిపారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

ఎలిగేడు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏకీకృత పెన్షన్ స్కీం యూపీఎస్ అమలు చేయాలని నిర్దేశించిన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ బషీరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మిట్టపల్లి యుగంధర్, ప్రధాన కార్యదర్శి సముద్రాల చంద్రమౌళి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పుల్లెల్ల శ్రీధర్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎలిగేడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వై.మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్‌రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రామగుండం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఏకీకృత పెన్షన్ పథకాన్ని వ్యతిరేకిస్తున్నామని టీఎస్ పీఆర్టీయూ రామగుండం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాండ్ర ప్రేమ్‌కుమార్, పర్లపెల్లి రఘుబాబు తెలిపారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంట రామన్న, మండల కార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు.

ముత్తారం: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సోమవారం ముత్తారంలో తహసీల్దార్ సుమన్‌కు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు తమ డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షుడు మారెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి తిరుపతి, పిల్లలమర్రి సత్తయ్య, శ్రీధర్, ఎస్.తిరుపతి, ఎం.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదా తక్షణమే రద్దు చేయాలి

గోదావరిఖనిటౌన్: విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించే యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఆవరణలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు యూజీసీ తెరలేపిందని అన్నారు. నాయకులు ఆర్నకొండ సాయి ఆజాద్, ఎల్కపెల్లి సురేశ్, మాతంగి సాగర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంద కృష్ణకు పద్మశ్రీపై సంబరాలు



గోదావరిఖనిటౌన్: చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ రావడంపై స్థానిక నాయకుడు కన్నూరి ధర్మేందర్ ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మాట్లాడుతూ.. మంద కృష్ణ దళితుల కోసం 30 సంవత్సరాలుగా చేసిన సామాజిక పోరాటాలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం గర్వించదగ్గ విషయమన్నారు. పల్లె బాపు, కోటగిరి పాపయ్య, కాసిపేట రాజయ్య, మచ్చ విశ్వాస్, తాళ్లపల్లి లక్ష్మణ్, ఈదునూరి కొమురయ్య, మాతంగి కుమార్, రాజేశం, దుర్గాప్రసాద్, సంతోష్, చిలుక ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం, కులాల వర్గీకరణ కోసం పోరాడిన నాయకుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటిచండంపై యైటింక్లయిన్‌కాలనీ ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ అసోషియేషన్, ఎమ్మార్పీఎస్ నాయకులు, బహుజనులందరూ డప్పులు కొడుతూ బాణసంచా కాల్చారు. దుర్గాప్రసాద్, చంద్రమౌళి, అంకూస్, కిష్టయ్య, శంకర్, రాజు, సారంగపాణి, శ్రీనివాస్, రాజేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పెద్దపల్లిరూరల్: రోడ్లపై వాహనాలు నడిపేవారు రహదారి భద్రతా నిమయావళిని పాటించాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. టోల్‌ప్లాజాకు చెందిన 30 మంది సిబ్బంది హెచ్‌కేఆర్ సహకారంతో రక్తదానం చేశారు.

పాలకుర్తి: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని సోమవారం బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్దపల్లి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించగా.. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్సై స్వామి చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.



పాలకుర్తి: ప్రశంసాపత్రం అందిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై స్వామి

గౌరెడ్డిపేట గౌడ సంఘం ఎన్నికపై వివాదం

పెద్దపల్లిరూరల్: గౌరెడ్డిపేట గీత పారిశ్రామిక సహకార సంఘ ఎన్నిక వివాదాస్పదమైంది. సంఘ ఓటరు జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను కుట్రపూరితంగా తొలగించి ఎన్నికను ఏకపక్షంగా నిర్వహించేందుకు ఓ వర్గం వారు ప్రయత్నిస్తున్నారంటూ గీత కార్మికులు ఎన్నికల నిర్వహణ కోసం వచ్చిన అధికారులతో వాదనకు దిగారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పోలీసులు చేరుకొని సముదాయించారు. ఓటరు జాబితాలో అర్హులైన వారందరి పేర్లను చేర్చి ప్రత్యేక సమావేశంలో జాబితా విడుదల చేయాలని నాయకులు కోట శ్రీనివాస్, గోపాల్, వెంకటి, తిరుపతి, ఆశాలు, మధు డిమాండ్ చేశారు. అధికారుల తీరుపై ఎమ్మెల్యేతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



గీత కార్మికుల నిరసన

మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు చెల్లించండి

సుల్తానాబాద్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల జీతాలను వెంటనే చెల్లించాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో సమ్మిరెడ్డి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

ఆలయంలో రుద్రాభిషేకం



భక్తులకు అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించగా.. తీర్థప్రసాదాలు అందజేశారు. జూలపల్లి నివాసి గుడిపాటి హేమంత్‌రెడ్డి, మానస భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మదర్‌థెరిసాలో ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం



పాల్గొన్న ఐబీఎం కంపెనీ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం టాస్, ఎడ్యూనేట్, ఐబీఎం కంపెనీ ఆధ్వర్యంలో స్కిల్ బిల్డ్ వర్క్‌షాప్ ప్రారంభమైంది. సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యార్థుల్లో ప్రతిభానైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు చేపడుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

ముత్తారం: ఖమ్మంపల్లికి చెందిన మంథని సమ్మక్క, రాజక్క అనే తల్లీబిడ్డలు, తమ బంధువు అయిన మంథని వంశీ అనే యువకుడి మధ్య ఆదివారం రాత్రి జరిగిన గొడవలో తల్లీబిడ్డలకు గాయాలయ్యాయి. సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేశ్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

రామగిరి: బేగంపేట గ్రామానికి చెందిన నాగేవల్లి శంకర్(54) ఆత్మహత్య చేసుకున్నాడు. రామగిరి పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శంకర్ కొద్ది రోజులుగా కుల వృత్తి మానేసి మద్యానికి బానిసయ్యాడు. రెండు నెలల క్రితం కంటి ఆపరేషన్ కాగా.. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లో పాలు తాగి బయటకు వెళ్తున్నానని కుమార్తెకు చెప్పి వెళ్లిపోయాడు. తర్వాత ఆమె ఇంటి వెనక చూడగా సీతాఫలం చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి కుమార్తె సూత్రం రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కాలనీ రెడ్డి సంఘం అధ్యక్షుడు పిన్నింటి రాంరెడ్డి కోరారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీ సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి చల్లా అశోక్‌రెడ్డి, బెల్లంకొండ విజేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, వీరారెడ్డి, రమేశ్‌రెడ్డి, సంధ్యారెడ్డి, మంజుల, లత, మంజులారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమణారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

అర్హులైన నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న లద్నాపూర్ భూనిర్వాసితులు

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని లద్నాపూర్ భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం లద్నాపూర్ గ్రామంలో భూనిర్వాసితులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామానికి చెందిన సుమారు 8 మంది నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పరిహారం చెల్లించకుండా అధికారులు బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని, అర్ధరాత్రి వచ్చి కూల్చివేతలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూనిర్వాసితులు బడికల విజయ, బడికల శ్రీనివాస్, మేడగొని రాజన్న, రొడ్డ శ్రీనివాస్, పర్శవేన శంకర్, పుల్లెల రాము, తోట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు

గోదావరిఖని: టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యూనియన్ జెండా ఎగరేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాదాసు రాంమూర్తి, వడ్డేపల్లి శంకర్, నూనె కొమురయ్య, పారుపల్లి రవి, కనకంశ్యాంసన్, చల్లా రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు అండగా ఉన్న సంఘం టీబీజీకేఎస్ యూనియన్ మాత్రమేనని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేశారు. టీబీజీకేఎస్ యూనియన్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, సురేందర్, రవితేజ, తిరుపతి, హరిప్రసాద్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగరేస్తున్న మిర్యాల రాజిరెడ్డి

మాతంగికాలనీని తరలించాలి

పెద్దపల్లిరూరల్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రభావిత ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతమైన మాతంగికాలనీని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు భిక్షపతి, రవీందర్ లక్ష్మారెడ్డి, మల్లేశ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్ గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్‌లో కలపకుండా సురక్షిత ప్రాంతానికి తరలించేవరకు గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని వెంకట్రావుపల్లి కేకేనగర్‌వాసులు నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

జాతీయ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో టేబుల్ టెన్నిస్ పోటీల్లో జాతీయ పోటీలకు ఎంపికైన సంప్రీత్‌ను అభినందించారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో 7వతరగతి చదువుతున్న సంప్రీత్, కోచ్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, ఎంఈవో రాజయ్య మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ సత్యనారాయణ తెలిపారు.



సంప్రీత్‌ను అభినందిస్తున్న కలెక్టర్

మేమున్నామని..



పాలకుర్తి: జీడీనగర్‌కు చెందిన పల్లపు కుమార్ కుటుంబానికి సోమవారం అతడి స్నేహితులు ఆపన్న హస్తం అందించి ఉదారత చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో కుమార్ మృతిచెందాడు. మృతుడికి భార్య విజయతోపాటు ముగ్గురు పిల్లలున్నారు. బసంత్‌నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 బ్యాచ్ విద్యార్థులంతా కలిసి రూ.60వేలు జమ చేసి రూ.50వేలు కుమార్ చిన్న కూతురు పేరు మీద బసంత్‌నగర్ పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగిలిన రూ.10వేలతో 50 కిలోల బియ్యం, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

బాలవికాసకు రూ.లక్ష వితరణ

ఓదెల: గూడెం గ్రామంలో మంచినీటి ఎద్దడి నివారణ కోసం బండారి మల్లేశం జ్ఞాపకార్థం ప్రమీల రూ.లక్షను మాజీ సర్పంచ్ ఉష్కమల్ల చంద్రమౌళి చేతుల మీదుగా బాలవికాస నీటి శుద్ధీకరణ చైర్మన్ ఉప్పుల శ్రీనివాస్‌కు సోమవారం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత

రామగుండం: అబాది రామగుండంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పలువురు దాతలు పలు వస్తువులను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయుడు రాంపెల్లి శ్రీనివాస్ తెలిపారు. నోట్ పుస్తకాలు, పెన్నులను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, రాగి జావా తాగేందుకు స్టీలు గ్లాసులను అంబటి సంతోష్‌రావు, అర్చన, కుమారి ధీమాహి అందజేసినట్లు పేర్కొన్నారు.

భూమిపూజ

గోదావరిఖని: ప్రజా కళాకారుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ నాయకులు జాకబ్ విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక న్యూఅశోక్ థియేటర్ ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. కవ్వంపల్లి స్వామి, మడ్డి ఎల్లాగౌడ్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, పి.శ్రీనివాస్, వేల్పుల నారాయణ, జిగురు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి విద్యార్థి ఓపెన్ స్కూల్‌కు..



కాల్వశ్రీరాంపూర్: బడి మానేసిన పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన చిలుముల విశాల్‌ను గుర్తించి విద్యాశాఖాధికారులు సోమవారం ముత్తారంలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదోతరగతిలో చేర్పించారు. కాల్వశ్రీరాంపూర్ ఎంఈవో మహేశ్, సీఆర్పీ కుంట కుమారస్వామి పాల్గొన్నారు.